జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 46 | సోమవారం | 7 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

# సంయమనం పాటించండి



హైదరాబాద్, జూలై 6 (సందేశం టైమ్స్): ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య వివాదం పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డే నేరుగా రంగంలోకి దిగారు. ఆదివారం మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మితాపటేల్‌లను తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో బాధ్యత గల నాయకులు అయ్యుండి.. పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన అంశాలను బహిరంగంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీకి బలమైన నాయకుల అవసరమేనని, అయితే ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమేనని సీఎం వెల్లడించినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఇప్పటికే అధిష్ఠానం వరకు వెళ్లిందని, ఇక మీదట సంయమనం పాటించాలని సూచించినట్లు తెలిసింది. కాగా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకున్న వివాదంపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ సోమవారం గాంధీభవన్‌లో భేటీ కావాల్సి ఉంది. అయితే ఆ సమావేశం వాయిదా పడినట్లు కమిటీ చైర్మన్ మల్లు రవి ప్రకటించారు. వరంగల్ కార్పొరేషన్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొనాల్సి ఉన్నందున భేటీని ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు ఓ ప్రకటనలో ఆయన వెల్లడించారు.




- వ్యవసాయ వర్సిటీలో సీఎం శ్రీకారం
- ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రెండు రోజుల పాటు హస్తినలోనే..
- కేంద్రమంత్రులను కలిసే అవకాశం

హైదరాబాద్/రాజేంద్రనగర్, జూలై 6 (సందేశం టైమ్స్): ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం సోమవారం ప్రారంభం కానుంది. సీఎం రేవంత్ రెడ్డి ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీకారం చుట్టనున్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, అటవీ దళాల ప్రధానాధికారి సువర్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏటా జూలై మొదటి వారంలో నిర్వహిస్తోంది. ఈ ఏడాది 18.02 కోట్ల మొక్కను నాటాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో అత్యధికంగా పంచాయతీరాజ్ శాఖ 7 కోట్లు, పురపాలక శాఖ 8 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించింది. అటవీ, వ్యవసాయ శాఖలు కూడా కోటి మొక్కలు నాటాలని ఆదేశించింది. గత ఏడాది 20 కోట్లు మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా.. అందులో 95% మొక్కలు నాటారు. ఈ ఏడాది 100% లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. వన మహోత్సవం కోసం 14,355 నర్సరీల్లో 20 కోట్ల మొక్కలు సిద్ధం గా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇళ్లు.. దేశానికే ఆదర్శం

**ఏడాదిలోనే పథకానికి రూ.22 వేల కోట్ల ఖర్చు**
**వచ్చే మూడేళ్లలో మరెన్నో పథకాలు అందిస్తాం**
**పుట్టగతులుండవనే ప్రతిపక్షాల ఆందోళన**
**కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయు: భట్టి విక్రమార్క**



మధిరటౌన్, జూలై 6 (సందేశం టైమ్స్) : ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఒక్క ఏడాదిలోనే ఈ పథకానికి రూ.22 వేల కోట్లు ఖర్చు చేసి 4.5 లక్షల మంది పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లు అధికారంలో ఉన్న వారు 'డబుల్‌బెడ్ రూం' పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తాను, సహచర మంత్రులమంతా ధృడసంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. రానున్న మూడున్నరేళ్లలో మరిన్ని అద్భుతమైన పథకాలు తీసుకువస్తామని చెప్పారు. తాము రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ గత పాలకులు చేసిన అప్పులు చెల్లిస్తూనే సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో తమకు పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలు ఆందోళన చెంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము ప్రజల కోసం నిటారుగా నిలబడతామని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఎరువులకూ కరువే..!



హైదరాబాద్, జూలై 6 (సందేశం టైమ్స్): కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని.. రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలు ఎగ్గొట్టడమే కాకుండా ఇప్పుడు ఎరువులకు కూడా తీవ్రమైన కరువు ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అప్పుతెచ్చి వ్యవసాయం చేద్దామన్నా.. కనీసం ఒక ఎరువుల బస్తా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రూ.266కు అందుబాటులో ఉండాల్సిన యూరియా బస్తా ధర ఇప్పుడు రూ.325కు చేరిందని, ఇందుకు కారణం ఏమిటని నిలదీశారు. కృత్రిమ కొరత సృష్టించి.. ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో తేల్చేందుకు తక్షణం విచారణ జరిపించాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని

# కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?



హైదరాబాద్, జూలై 6 (సందేశం టైమ్స్): "అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎసఏ) హెచ్చరించింది. అయినా సరే, కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు పదే పదే మాట్లాడుతున్నారు. దీని వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే ఉద్దేశం లేదు. కుంగే బ్యారేజీలకు నీళ్ల ఎత్తిపోయాలా?" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పానలనో రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. సీకెంట్ ఫైల్స్ టెక్నాలజీతో మేడిగడ్డ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ఎన్డీఎసఏ తప్పుబట్టిందని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అదే సీకెంట్ ఫైల్స్ పౌండేషన్ టెక్నాలజీతో నిర్మించటంతో ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. ఎన్డీఎసఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం హరీశ్ రావుకు అలవాటైపోయిందని, ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలన్నారు. గత ఏడాది వానాకాలంతో పాటు ఇటీవలి యాసంగిలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేశారని చెప్పారు.

# ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి


కవాడిగూడ, జూలై 6 (సందేశం టైమ్స్) : ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలుపెట్టిన ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తిచేయలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి కవిత హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత నాటి సీఎం కేసీఆర్ ఎరుకల కులస్థుల అభివృద్ధి కోసం ఎంపవర్మెంట్ స్కీంను ప్రవేశపెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని తుంగలో తొక్కిందన్నారు. తాను శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదని విమర్శించారు. 50వేల ఎరుకుల కుటుంబాలకు రూ.60కోట్ల మేర లబ్ధి చేకూర్చే పథకాన్ని మెరుగుపరిచి ప్రభుత్వం యధాతథంగా అమలు చేయాలన్నారు. రూ.500 కోట్లతో ఎరుకుల కార్పొరేషన్‌నూ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా అన్నదానం ముగిసిన నవరాత్రి వేడుకలు




జూలై 6 (సందేశం టైమ్స్) :పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు నందుల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు నిర్వహిస్తూ, చివరి రోజు కావడంతో దేవాలయంలో హెూమాలు పూజలు భారీ ఎత్తున నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదానం చేశారు. దారావత్ హాజీ నాయక్, చిట్టి కళావతి, కైలా స్వామి నాయక్, వాల్యా నాయక్, తుమ్మలపల్లి అజంత భాస్కర్, పైడిమఱ్ఱి వెంకటనారాయణ, కరి సుబ్బారావు, నాగేశ్వరరావు, వాణి, జ్యోతి, సత్యనారాయణ, బర్మావత్ మోహన్ రావు, భిక్షమయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కబ్జా నుండి రహదారికి విముక్తి కల్పించిన అధికారులు....

జూలై 6 (సందేశం టైమ్స్) : అనంతగిరి మండలం : కబ్జా నుండి రహదారికి విముక్తి కల్పించిన సంఘటన మండల పరిధిలోని అల్వాల్ పురం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆశీర్వాదమ్మ అల్వాల్ పురం గ్రామపంచాయతీ పరిధిలో 315 సర్వే నెంబర్ లో నాలుగు ప్లాట్లను 2016లో కొని దానిలో అపార్ట్మెంట్ నిర్మించారు. దానికి వెళ్లే రహదారిని ఓ వ్యక్తి కబ్జా చేసినట్లు ఇటీవల జరిగిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందించి మండల అధికారుల ను కార్యదర్శిని సమస్య పరిష్కరించమని ఆదేశించారు. దీంతో ఎంపీ ఓ పాండురంగన్న, కార్యదర్శి రమాదేవి, అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని జెసిబి, గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో రహదారికి అడ్డంగా అమర్చిన తీగలను తొలగించి రహదారికి విముక్తి కల్పించారు. ఎటువంటి గొడవలు చోటు చేసుకోకుండా సమస్యను సానుకూలంగా పరిష్కరించారు.

# కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా పిడమర్తి గాంధీ



జూలై 6 (సందేశం టైమ్స్) : కోదాడ : కోదాడ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ %ూదీచీ% పిడమర్తి గాంధీ ఎన్నికయ్యారు. పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో శుక్రవారం మాజీ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు %ూదీచీ% గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకరించిన మీడియా పెద్దలకు కృతజ్ఞతలు తెలియపరిచారు. ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి వద్దకు చేర్చి పరిష్కారం అయ్యేలా చొరవ చూపిస్తా అని అన్నారు. అందరిని సమన్వయ పరిచి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రిపోర్టర్లు పూర్ణచందర్రావు, కుడుముల సైదులు, చింతలపాటి సురేష్, వెంకటనారాయణ, గంధం రాము, తోటపల్లి నాగరాజు, శ్రీకాంత్, లక్ష్మణ్, మధు, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, పడిశాల నాగరాజు, మార్కాపుడి సంపత్, వాసు, నజీర్, సత్యరాజు, రామారావు, సునీల్, బుచ్చి రాములు, సతీష్, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు......

# అభివృద్ధి పథంలో నర్సాపూర్ నియోజకవర్గం - ఆవుల రాజిరెడ్డి




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సందేశం టైమ్స్ (జూలై 6): నర్సాపూర్ మండలంలోని నత్నయపల్లి గ్రామంలో ఈరోజు సీసీ రోడ్ల నిర్మాణ పనులను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి సీసీ రోడ్ల నిర్మాణం ఎంతో అవసరమని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.అంతేగాక గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే తమ ధ్యేయమని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి సురక్షిత నివాసం అందించడంలో తన వంతు పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి సాగుకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 5జులై సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గ పరిధిలో నీ మనూర్ మండల్ సమీకృత అభివృద్ధి మిషన్ పథకం ద్వారా ఉల్లి సాగుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందని. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ఉద్యానవన శాఖ అధికారిణి మౌనిక రెడ్డి అన్నారు. శనివారం రాణాపూర్, తుమ్మునుర్ గ్రామ ఉల్లి సాగు చేసే రైతులకు తుమ్నూర్ గ్రామ పంచాయతీలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉల్లి సాగు కోసం ఎకానికి రూ.8000 చొప్పున సబ్సిడీ అందించనుందని అన్నారు. అదేవిధంగా పండ్ల తోటల నిర్వహణకుగాను కూరగాయల సాగుకు వివిధ రకాల వాటికి సబ్సిడీ అందించడం జరుగుతుందని అన్నారు. ఆయిల్ పామ్ పంట పండించే రైతులకు ఎలాంటి దళారి వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గోద్రేజ్ ఆగ్రోవేట్ సంస్థ పంట కొనుగోలు చేస్తుందని అన్నారు.ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.50,918 రాయితీ రూపంలో ఇస్తుందని అన్నారు. పంటల మార్పిడిలో భాగంగా ఉద్యాన వన పంటల సాగును పెంచాలని, దీని ద్వారా రైతులకు అధిక లాభాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహన్, ఏఈఓ సంధ్యా, మాజీ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, బషన్న, లక్ష్మన్న, సుభాష్‌రావు, పండరినాథ్‌రావు, రాజు పాల్గొన్నారు.

# రండి.. కలిసికట్టుగా ముందుకు సాగుదాం.. సీఎం విజ్ఞప్తి

హైదరాబాద్,జూలై 6 (సందేశం టైమ్స్) : వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. (శనివారం) ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బాలల లైంగిక వేధింపులు, రక్షణ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీస్, ఇతర నిర్వహకులను సీఎం అభినందించారు. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.పిల్లలు, మహిళల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ 'భరోసా' ప్రాజెక్టను తీసుకొచ్చిందని.. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నా యని వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయపరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడమే ఈ కేంద్రాల లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఫోక్సో చట్టం, జువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నా యని... అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాఘతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతీ దశలోనూ రక్షణ ఉండాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని.. రక్షణ కల్పించాలని తెలిపారు. 'న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను.

# సాంప్రదాయ బద్దంగా బోనాలు : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్ జూలై 6 (సందేశం టైమ్స్) : మన సంస్కృతి, సాంప్రదాయాలను మరింత పెంపొందించే విధంగా బోనాల ఉత్సవాల ను ఘనంగా జరుపుకుందామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని 268 దేవాలయాలకు బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం కోటి 62 లక్షల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్ లు, అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెప్పే బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో డిమాండ్ చేసినా అమలుకు నోచుకోలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. బోనాలను వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకే కాకుండా ప్రైవేట్ ఆలయాలకు కూడా ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. అదే పరంపర ను కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తుండటం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.53 లక్షలు లూటీ



హైదరాబాద్ జూలై 6 (సందేశం టైమ్స్) : నగరంలో సైబర్ నేరగాళు మరోసారి విజృంభించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సరికొత్త మోసానికి పాల్పడి, అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. 53 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.గత నెల 18న బాధితుడికి ఒక గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఢిల్లీ డీసీపీ రాజీవ్ కుమార్‌ను అని పరిచయం చేసుకున్నాడు. బాధితుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయిందని నమ్మబలికాడు. వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని బెదిరించాడు. తన మాటలను బాధితుడు నమ్మేలా చేయడానికి, బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఒక నకిలీ ఆర్డర్ కాపీని వీడియో కాల్‌లో చూపించాడు.దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వృద్ధుడు, తనపై కేసు నమోదు చేయవద్దని వారిని వేడుకున్నాడు. ఇదే అదనుగా భావించిన నేరగాళ్లు, కేసు నుంచి బయటపడాలంటే తమకు సహకరించాలని సూచించారు.

# పెద్దమ్మ ఆలయం... ఆధ్యాత్మిక వైభవం



జులై 6(సందేశం టైమ్స్) జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న శాకాంబరి ఉత్సవాలుతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం కూరగాయలతో అలంకరించారు. సాయంత్రం కూరగాయలను భక్తులకు పంపిణీ చేశారు. పల్లకీ సేవ అనంతరం బాణసంచా వెలుగుల్లో ఆలయం ధగధగలాడింది. చాంద్రాయణగుట్ట: సప్త మాతృకులకు సప్త బంగారు బోనంలో భాగంగా భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు జి.రాఘువేందర్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఆలయానికి వెళ్లి పెద్దమ్మతల్లికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. జోగిని అవికాదేవి నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బోనాన్ని తీసుకొచ్చారు. వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెరుచుకున్న తుంగభద్ర గేట్లు.. దిగువకు నీరు విడుదల



గద్వాల, జులై 6(సందేశం టైమ్స్) :కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

# అర్ధరాత్రి ఆర్డర్లూ అధికమే..

## గతేడాదితో పోలిస్తే ఎక్కువే
## హైదరాబాద్‌లో పాలకు డిమాండ్




హైదరాబాద్, జులై 6(సందేశం టైమ్స్) ఆన్‌లైన్‌లో పగటిపూటతో పాటు అర్ధరాత్రిళ్లు సైతం ఆర్డర్లు అధికమైనట్లు ఇన్‌స్టామార్ట్ సంస్థ అధ్యయనంలో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బాగా పెరిగినట్లు తెలిపింది. సంస్థ అధ్యయనం ప్రకారం గడిచిన తొలి ఆరు నెలల్లో ఒక వ్యక్తి ఏకంగా 617కు పైగా ఆర్డర్లు చేశాడు. నగరంలో పాలకు అత్యధిక డిమాండ్ ఉంది. ఎలక్ట్రానిక్స్, బొమ్మలు, వ్యక్తిగత సంరక్షణ విభాగాలు 117 శాతం వృద్ధితో దూసుకుపోతున్నాయి. ఇడ్లీ, దోశ పిండి ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. బ్యూటీ విభాగంలో లిప్ లైనర్లు, మినీ లిప్‌స్టిక్‌లు, లిప్ బామ్‌లకు డిమాండ్ ఉంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత వంటనూనె, ఉల్లిపాయలు వంటి నిత్యావసర వస్తువులకు, స్నాక్స్ విభాగంలో ఇన్‌స్టంట్ న్యూడిల్స్ కు డిమాండ్ పెరిగిందని సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ హరి కుమార్‌జీ తెలిపారు. సగటు డెలివరీ సమయం 11 నిమిషాలుగా ఉందన్నారు.

# చెరువుల్లోకిచేరని చేపలు



## చేప పిల్లల పంపిణీపై స్పష్టత కరువు
## ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రాని ఆదేశాలు
## - ఆశగా ఎదురుచూస్తున్న మత్స్యకారులు
## - నగదు బదిలీ చేయాలని డిమాండ్

వనపర్తి,జులై 6 (సందేశం టైమ్స్) : చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను ఎప్పుడు వదులుతారని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగింది. ఎదిగిన చేపల విక్రయం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి చేకూరింది. ఆ తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పథకాన్ని కొనసాగించింది. అలాగే గత ఏడాది కూడా చేప పిల్లలను పంపిణీ చేసింది. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రతీ సంవత్సరం ఏప్రిల్ మాసంలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించేది. కానీ ఈ ఏడాది జూలై నెల వచ్చినప్పటికీ ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. టెండర్లు పిలువలేదు. దీంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. పంపిణీ చేస్తారా? లేదా? అని మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో అమలుపై సందిగ్ధం నెలకొన్నది.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 వేలకు పైగా చెరువులు, కుంటలు, 15 రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిలో ప్రతీ ఏటా 8 కోట్లకు పైగా చేప పిల్లలను వదులుతూ వస్తున్నారు. అవి పెరిగి పెద్దయ్యాక వాటిని విక్రయించి వేలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒక్క వనపర్తి జిల్లాలోనే 142 మత్స్యకారుల సంఘాలున్నాయి. వాటిల్లో 13,600 మంది సభ్యులున్నారు. వీరంతా చేపల విక్రయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటున్న ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు రాలేదని చెప్పుండటంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

**సకాలంలో పంపిణీ చేయాలి**

జిల్లాలో ప్రతీ సంవత్సరం అదును దాటిన తరువాత చేప పిల్లలను సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు పంపిణీ చేస్తున్నారు. వాటిలో ప్రధానంగా నాలుగు రకాలైన బొచ్చ, రౌట, మోస్, బంగారు తీగలను వదులుతున్నారు. కానీ సరైన సమయంలో వదలకపోవడంతో చేప పిల్లలు ఎదగడం లేదు. దీంతో తమకు మేలు జరగడం లేదని చెప్తున్నారు. ఆగస్టులోపు చెరువుల్లో చేపలను వదిలితే బాగా ఎదుగుతాయని అంటున్నారు. అయితే కాంట్రాక్టర్లు కూడా నాసిరకం చేప పిల్లల్ని పంపిణీ చేస్తున్నారని, దీంతో అవి ఆశించిన మేర ఎదగడం లేదని ఆరోపిస్తున్నారు.


# యూరియా తిప్పలు..

## సీజన్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు
## ఎరువుల కోసం ఎదురుచూపులు
## సహకార సొసైటీలకు నిత్యం పరుగులు
## సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
## బీఆర్ఎస్ హయాంలో ఈ దుస్థితి లేదంటున్న అన్నదాతలు



ఖమ్మం, జులై 6 (సందేశం టైమ్స్) ,: రైతన్నలకు తిప్పలు మొదలయ్యాయి. ఆంధ్రా పాలకుల సమయంలో కనిపించిన దృశ్యాలు పునరావృతమవుతున్నాయి. నేటి కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే అన్నదాతలు చుక్కలు చూస్తున్నారు. యూరియా కోసం పాడరాని పాట్లు పడుతున్నారు. సహకార సొసైటీల వద్ద నిత్యం పడిగాపులు కాస్తున్నారు. అధికారులేమో యూరియా ఇంకా రాలేదని తాపీగా సమాధానం చెప్పి పంపిస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న ఖమ్మం జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉందంటే.. రాష్ట్రంలో పరిస్థితి వేరేచెప్పనక్కరలేదు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఎక్కడా ఇబ్బంది కలిగిన సందర్భాలు లేకపోవడంతో రైతులు ఆ రోజులను గుర్తు చేసుకుంటున్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెడ్డీపై బాధితుడి నిరసన



హైదరాబాద్:జులై 6 (సందేశం టైమ్స్) : అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ భూ బాధితుడు వినూత్న నిరసన చేపట్టాడు. తన ఒంటిపై ఉన్న షర్టు, ఫ్యాంటును విప్పేసి చెడ్డీపై కార్యాలయం ప్రధాన గేటు ఎదుట కూర్చుని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ఏళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న తనకు న్యాయం జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అతడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేటకు చెందిన శంకర్‌రెడ్డి 2000లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలోని సర్వే నంబర్ 109,110లో 6 ఎకరాలను 99 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నాడు. అనంతరం 2002లో సదరు భూమిని కొనుగోలు చేసేందుకు పట్టాదారుల వద్ద అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఇద్దరి మధ్య భూ వివాధం తలెత్తడంతో ఇరువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ద్వారా ఫీజు చెల్లించి 2016లో శంకర్‌రెడ్డి 6 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.దీంతో శంకర్‌రెడ్డి పేరుపై రెండు ఎకరాల భూమి రికార్డులో నమోదు అయి పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. మిగతా నాలుగు ఎకరాలకు సంబంధించి వివాదం కొనసాగుతూనే ఉన్నది. అయితే అప్పటి నుంచి నాలుగు ఎకరాల భూమికి సంబంధించి పట్టాదారు పాసుబుక్‌ల కోసం శంకర్‌రెడ్డి కుమారుడు గంగిరెడ్డి గిరిధర్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.కాగా 2022లో ఆమోద డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం శంకర్‌రెడ్డికి చెందిన 6ఎకరాల భూమిని తప్పుడు పత్రాలు సమర్పించి రికార్డులో శంకర్‌రెడ్డి పేరును తొలగించి ఆమోద డెవలపర్స్‌పై పేరును నమోదు చేయించి పట్టాదారు పాస్‌బుక్‌లను పొందారు. అయితే ఈ విషయం తెలుసుకున్న శంకర్‌రెడ్డి కుమారుడు గిరిధర్‌రెడ్డి తమకు ఎలాంటి నోటీసు, సమాచారం ఇవ్వకుండా రికార్డుల నుంచి తమ పేర్లు ఎలా తొలగిస్తారని అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

# అన్నదాతపై మరో పిడుగు

**పొటాష్ ధర రూ.250 పెంచిన కేంద్రం**
**భద్రాద్రి జిల్లాలో 17,730 టన్నులు అవసరం**
**రైతులపై రూ.8.87 కోట్ల అదనపు భారం**




అశ్వారావుపేట,జులై 6(సందేశం టైమ్స్) : అన్నదాతపై కేంద్ర ప్రభుత్వం మరో పిడుగు వేసింది. వ్యవసాయ పంటలకు కచ్చితంగా వినియోగించాల్సిన పొటాష్ ధరను అమాంతం పెంచేసింది. ఇప్పటికే యూరియా, డీఏపీ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పెరిగిన పొటాష్ ధర మరింత ఆర్థిక భారమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 5.91 లక్షల ఎకరాల్లో సాగవుతున్న వివిధ పంటలకు సుమారు 17,730 మెట్రిక్ టన్నుల పొటాష్ అవసరం ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లా రైతాంగంపై పెరిగిన పొటాష్ ధర పెంపుతో రూ.8.87 కోట్ల వరకు అదనంగా భారం పడనుంది.వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు చేదు కబురు చెప్పింది. గుట్టుచప్పుడు కాకుండానే పొటాష్ ధరను భారీగా పెంచింది.

# లక్కీడ్రా పేరుతో మోసం ముగ్గురు మోసగాళ్ల అరెస్టు

మిర్యాలగూడ, జులై 6(సందేశం టైమ్స్) లక్కి డ్రా పేరు తో మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతా ల ప్రజలను మోసం చేసిన ముగ్గురు ఘరానా మోసగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడలోని హౌసింగ్‌బో ర్డు కాలనీలో ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మల్టీలెవల్ సంస్థను స్థాపించి.. లక్కి డ్రా పేరుతో సభ్యులను చేర్పిస్తున్నారని తెలిపారు.లక్కి డ్రా పేరుతో మోసం ముగ్గురు మోసగాళ్ల అరెస్టు లక్కి డ్రా పేరు తో మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతా ల ప్రజలను మోసం చేసిన ముగ్గురు ఘరానా మోసగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వివరాలు వెల్లడించారు.

# సీబీఎస్ఈ వైపు మొగ్గు

## తగ్గుతున్న స్టేట్ సిలబస్ విద్యార్థులు



**ప్రభుత్వ, స్టేట్ సిలబస్ కలిగిన ప్రైవేటు పాఠశాలల్లో కలిపి గత విద్యా సంవత్సరం 3,44,209 మంది విద్యార్థులు**

**ప్రస్తుత విద్యా సంవత్సరంలో 3,24,180 మంది**

**గత ఏడాది పోల్చితే 16,587 తగ్గుదల**

**ఒకటో తరగతిలో పడిపోయిన అడ్మిషన్లు**

విశాఖపట్నంజులై 6(సందేశం టైమ్స్):స్టేట్ కంటే సీబీఎస్ఈ సిలబస్ అయితే తమ పిల్లలకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కార్పొరేట్, పెద్దస్థాయి సీబీఎస్ఈ పాఠశాలల్లో మాత్రం పెరిగాయి. నగరంలో పిల్లలు ఎక్కువగా సీబీఎస్ఈ సిలబస్ బోధించే పాఠశాలల్లో చేరుతున్నారు. అదే గ్రామీణ ప్రాంతంలో తల్లికి వందనం పథకం అందిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు.

గత విద్యా సంవత్సరంతో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు 16,587 మంది తగ్గారు. గత విద్యా సంవత్సరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 72,678 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుత ఏడాది బుధవారం వరకు 66,515 మంది ఉన్నారు. అంటే గత ఏడాది కంటే 6,163 మంది తగ్గారు. ఒకటో తరగతిలో గత ఏడాది 4,011 మంది చదవగా, ప్రస్తుతం అదే తరగతిలో ఇంతవరకు 3,048 మందే ప్రవేశాలు పొందారు. అంటే 963 మంది తగ్గారని విద్యా శాఖ గుర్తించింది. అలాగే గత ఏడాది ఐదో తరగతిలో 7,777 మంది ఉండగా వారిలో 7,169 మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరారు. మిగిలిన తరగతుల్లో మాత్రం స్వల్పంగా పెరుగుదల కనిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు (స్టేట్ సిలబస్) కలిపి గత విద్యా సంవత్సరంలో 3,44,209 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో బుధవారం వరకు 3,24,180 మంది ఉన్నారు. అంటే 16,587 మంది తగ్గారన్నమాట. గత ఏడాది ఒకటో తరగతిలో 33,531 మంది ఉండగా, ఇప్పుడు 26,813 మంది చేరారు. ఒకటో తరగతిలోనే 6,718 మంది తగ్గారు. ఐదో తరగతిలో 34,068 మంది ఉండగా వారంతా ఆరో తరగతిలో చేరాలి. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరంలో 31,892 మంది చేరగా 2,194 మంది సీబీఎస్ఈ సిలబస్‌లో చేరి ఉంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మిగిలిన తరగతులకు సంబంధించి గత ఏడాదితో పోల్చితే తగ్గుదలే కనిపించింది.


ఒకటో తరగతిలో ప్రవేశాల తగ్గడానికి జనన రేటు తగ్గడం ఒక కారణం కాగా, సీబీఎస్ఈ సిలబస్‌లో చదివించాలని చాలామంది తల్లిదండ్రులు భావించడం మరో కారణమని ఉపాధ్యాయులు విశ్లేషిస్తున్నారు. స్టేట్ సిలబస్‌తో పోల్చితే సీబీఎస్ఈ సిలబస్ వైపునకు మొగ్గుచూపడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు. స్టేట్ సిలబస్ ప్రశ్నలు, జవాబులతో సాగుతుందని, గైడ్లు, మెటీరియల్ నోట్స్ చదువుకుంటే పరీక్షలలో 90 శాతానికి మించి మార్కులు వస్తున్నాయని, అయితే జాతీయ స్థాయిలో పరీక్షల్లో చతికిలపడుతున్నారని ఆనందరావు అనే గణితం టీచర్ వ్యాఖ్యానించారు. సీబీఎస్ఈ సిలబస్‌లో చేర్పిస్తే ఉదయం వెళ్లిన విద్యార్థి రాత్రి వరకు స్కూలులో ఉండే అవసరం లేదని, మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి చేరతాడని, సాయంత్రం ఆటలు, ఇతర యాక్టివిటీస్ దిశగా వెళ్లేందుకు సమయం ఉంటుందని పేర్కొన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌లో పూర్తిగా పాఠ్యపుస్తకం చదవాల్సి ఉంటుందని, దాంతో పోటీ పరీక్షలలో సునాయాసంగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని నారాయణ మెడికల్ అకాడమీ డీన్ హనుమంతరావు అన్నారు. జిల్లాలో సీబీఎస్ఈ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య పెరిగిందన్నారు. ఈ ఏడాది నీట్, ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో మన పిల్లలకు జాతీయ స్థాయి ర్యాంకులు తగ్గాయని పేర్కొన్నారు. పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందేందుకు చదువుతోపాటు ఆటలు, ఇతరత్రా కోర్సులు నేర్చుకోవడం ముఖ్యమని, అందుకు సీబీఎస్ఈ స్కూళ్లలో సమయం దొరుకుతుందని కేంద్రీయ విద్యాలయం టీచర్ లలితకుమారి వివరించారు. భవిష్యత్తులో రాష్ట్ర సిలబస్ నుంచి సీబీఎస్ఈ సిలబస్‌లో మారే పిల్లల సంఖ్య పెరుగుతుందని అన్నారు.

## సచివాలయ ఉద్యోగి చేతివాటం



వెదురుకుప్పం, జులై 6(సందేశం టైమ్స్) : :మామిడి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ఓ సచివాలయ ఉద్యోగి నకిలీ టోకెన్లతో మోసగించిన ఘటన కార్వేటినగరం మండలంలో వెలుగుచూసింది .డీఎంపురం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేషకు కార్వేటినగరం మండలం అన్నూరు వద్ద వున్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద డ్యూటీ వేశారు.ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు మామిడి కాయలు తోలుకొచ్చే రైతులకు సహకారం అందించే విధులు ఆయనవి.రైతుల రద్దీని తట్టుకోలేక చాలా ఫ్యాక్టరీల వద్ద టోకెన్ సిస్టం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.మామిడి రైతులకు అవసరమైన టోకెన్ల డిమాండ్‌ను గుర్తించిన వెంకటేష పుత్తూరులో నకిలీ టోకెన్ల బుక్, ఏబీసీ ఫ్యాక్టరీ అధికారి సీలు తయారు చేయించాడు. ఆ అధికారి సంతకం ఫోర్జరీ చేసి రైతులకు టోకెన్లను రూ.వెయ్యి చొప్పున విక్రయించాడు.నకిలీ టోకెన్లను మొదట ఫ్యాక్టరీ సిబ్బంది గుర్తించలేదు.గురువారం తాము ఇచ్చిన టోకెన్లకన్నా ట్రాక్టర్లు ఎక్కువగా ఉండడం గమనించిన యాజమాన్యం ప్రత్యేక నిఘా ఉంచితే నకిలీ టోకెన్లతో వచ్చిన 20 ట్రాక్టర్లు మామిడి కాయలను అన్‌లోడ్ చేసినట్లు గుర్తించారు.ఇంకా నకిలీ టోకెన్లతో వచ్చిన ట్రాక్టర్లు ఫ్యాక్టరీ ఆవరణంలో వున్నట్లు కూడా గుర్తించారు.వాటిని శుక్రవారం అన్‌లోడ్ చేయకుండా కార్వేటినగరం పోలీసులకు ఫ్యాక్టరీ మేనేజరు వెంకటేష్ ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్.హనుమంతప్ప ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.34 నకిలీ టోకెన్లను సీజ్ చేసి సచివాలయ ఉద్యోగి వెంకటేషపై కేసు నమోదు చేశారు.ఇంకా ఈ నకిలీ టోకెన్ల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో పోలీసు దర్యాప్తులో తేలనుంది.

## అర్ధరాత్రి కూలిన భారీ వృక్షం



పొందూరు,జులై 6(సందేశం టైమ్స్) : చిలకపాలెం-పొందూరు రహదారిలో భగవాన్‌దాస్‌పేట సమీపంలో అర్ధరాత్రి దశాబ్దాల నాటి భారీ వృక్షం నేల కూలింది. కొద్ది రోజులుగా కురు స్తున్న వర్షాలకు కూకటివేళ్లతో సహా వృక్షం కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సమాచారాన్ని అందుకున్న ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో చేరుకుని ఆ వృక్షాన్ని తొలగించారు. కాగా ఈ రహదారిలో ఇటువంటి భారీ వృక్షాలు చాలా ఉన్నాయని, ప్రమాదకరంగా ఉన్నవాటిని తొలగించేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

**ప్రవేశాల్లో సత్తా చాటిన బాలికలు**

**ఈ నెల 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్**




బాసర,జులై 6(సందేశం టైమ్స్) : 2025-26 విద్యాసంవత్సరానికి బాసర, మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటీలో ఎంపికైన విద్యార్థుల జాబితాను వర్సిటీ వైస్ చాన్సలర్ గోవర్ధన్, ఏవో మురళీధరన్ బాసరలో విడుదల చేశారు. ప్రవేశాల్లో ఏకంగా 72శాతం బాలికలు ఎంపికై సత్తా చాటారు. అలాగే ఎంపికైన వారిలో 88శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు చెందినవారే. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో 20, 258 దరఖాస్తులు రాగా.. రెండు క్యాంపస్‌లో కలిపి మొత్తం 1690 సీట్లకు సంబంధించిన జాబితాను ప్రకటించారు.

ఈ వివరాలన్నింటినీ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అధికారులు అందుబాటులో ఉంచామని వీసీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 7, 8, 9తేదీల్లో బాసర క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

## విద్యుత్ శాఖకు రూ.76లక్షల ఆదాయం



చిత్తూరు,జులై 6(సందేశం టైమ్స్) :గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్నవారు అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి డెవలప్‌మెంట్ చార్జీలో ప్రభుత్వం 50 శాతం రాయితీని ఇచ్చింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీవరకు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని 3,780 మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు. దీంతో విద్యుత్‌శాఖకు రూ.76,63,650 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

రాయితీ ఇచ్చిందిలా..

ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడుతో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీ రూ.2వేలు, దరఖాస్తుకు రూ.50 కలిపి రూ.2250 చెల్లించాలి. ప్రభుత్వం డెవలప్‌మెంట్ చార్జీలో రాయితీ ఇవ్వడంతో రూ.2వేలకు బదులు రూ.వెయ్యి మాత్రమే వసూలు చేశారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణ వివరాలు

డివిజన్ సర్వీసులు వచ్చిన ఆదాయం

చిత్తూరు 2245 44,11,150

చిత్తూరు రూరల్ 551 11,57,400

పుంగనూరు 984 16,95,100

మొత్తం 3780 72,63,650

అదనపు లోడు ఎందుకంటే..

గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లిస్తారు. అధిక శాతం మంది రెండు లేదా మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారవే అధికారులు ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్లు వంటివి ఏర్పాటు చేసుకున్నా.. అందుకు అనుగుణంగా అదనపు లోడు పడుతుంది. అయితే అందుకు చార్జీలను చెల్లించరు. దీనివల్ల ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతోపాటు లోఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి.

జరిమానా తప్పదు

లోఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లోని ఇంటింటినీ విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేస్తారు. వారు తీసుకున్న లోడు ఆధారంగా గృహోపకరణాలు వినియోగిస్తున్నారా? లేదా? అని పరిశీలిస్తారు. అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తేలితే లోడుకు అనుగుణంగా జరిమానా వి?ధిస్తారు.

# ఎరుపెక్కిన గోదావరి

## భద్రాచలం వద్ద 15.4 అడుగులు
## ధవళేశ్వరం వద్ద 10.70 అడుగులు



రాజమహేంద్రవరం,జులై 6(సందేశం టైమ్స్) : గోదావరి ఎరుపెక్కింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు క్రమంగా వచ్చి చేరుతోంది. భద్రాచలం వద్ద సాయంత్రం ఆరు గంటలకు 15.4 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి 98,609 క్యూసెక్కుల వరద కాటన్ బ్యారేజీకి చేరుతోంది. దీంతో 37 గేట్లు, ర్యాలి ఆర్మ్‌లో 20, మద్దూరు ఆర్మ్‌లో 11, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 14 గేట్లను 0.40 మీటర్ల మేర పైకెత్తి 99,689 క్యూసెక్కుల అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.70 అడుగులు నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 1,68,729 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. 902 హిల్ ప్రాంతం నుండి స్పిల్ ఛానల్ మీదుగా దిగువ కాఫర్ డ్యామ్‌కు వేసిన రోడ్డు మార్గం పూర్తిగా నీటమునగడంతో లారీలు స్పిల్‌వే మీదుగా ప్రయాణిస్తున్నాయి. ప్రాజెక్ట్ దిగువన ఆరు మీటర్ల నీటిమట్టం నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పోలవరం నిర్వాసిత మండలాల్లోని గోదావరి, శబరి నదుల ప్రవాహాలు క్రమేపీ పెరుగుతున్నాయి. వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వరద పెరుగుతుండడంతో కూనవరం, విఆర్.పురం, ఎటపాక, చింతూరు మండలాల వాసుల్లో భయాందోళన నెలకొంది. దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయంలోకి భారీగా వరద నీరు ప్రవేశించడంతో దర్శనాలు నిలిపివేస్తున్నట్లు దేవస్థాన ఇఒ ప్రకటించారు.

# పుష్కరాల నాటికి నగరంలో అన్ని సదుపాయాల ఏర్పాటు

## స్వర్ణాంధ్ర-2047 యాక్షన్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
## ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు, ఎంఎల్‌సి వీర్రాజు




రాజమహేంద్రవరం,జులై 6 (సందేశం టైమ్స్) :2027 పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, స్వర్ణాంధ్ర 2047లో భాగంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మున్సిపల్ కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్, ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, పరిశ్రమలు, టూరిజం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, విద్యాశాఖ, మెప్మా, తదితర శాఖల అధికారులతో ఆయా అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర-2047 నాటికి దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికను, స్వర్ణాంధ్ర 2027 నాటికి స్వల్పకాలిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రాజమహేంద్రవరం నగరాన్ని ఒక టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తే ఆర్థికంగా పరిపుష్టి సాధించ గలుగుతామన్నారు. పేదరికం లేని సమాజం, ఆరోగ్యం పరిశుభ్రత, ఇన్ఫ్రాస్ట్రక్చర్, కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాలపై దృష్టి సారించాలని అందుకు అవసరమయ్యే అన్ని మార్గాలను అన్వేషించాలన్నారు. 2027లో పుష్కరాలు రానున్నందున యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, తాగునీరు, శానిటేషన్, గ్రీనరీ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటినుంచే అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు సిద్ధం చేసుకోవాలన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ దశల వారీగా అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వారంగాలు మరింత లాభసాటిగా మార్చే అభివృద్ధి దిశగా ఆలోచనలు చేయాలని ఆయన కోరారు. గోదావరి నదీ జలాలు కలుషితం కాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేయాలని, ఇందుకు సంబంధించి ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. గోదావరి ఫ్రంట్ వ్యూ అభివృద్ధి కార్యక్రమం కూడా చేపడతామన్నారు. తద్వారా నగరం ఆర్థికంగానూ, ఉపాధి అవకాశాల కల్పనలోను మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ తయారుకు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. అన్ని శాఖల అధికారులు నివేదికలు పక్కాగా తయారు చేసుకొని తదుపరి కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి ఏ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే మెరుగుగా ఉంటాయో సముచిత ఆలోచనలు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తి బాబు, వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గూగూడులో మద్యం బంద్



నార్పల,జులై 6(సందేశం టైమ్స్) ,:మండల పరిధిలోని గూగుడు గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు గూగుడు మద్యం విక్రయాలు బంద్ చేశారు. గూగుడు గ్రామంలో ఉన్న మద్యం దుకాణాన్ని కూడా శనివారం నుంచి మూసివేయడం జరుగుతుందని గూగూడులోకి బయట నుంచి మద్యం తెచ్చిన గూగుడులో ఎక్కడైనా రహస్యంగా మద్యం విక్రయించిన కఠిన చర్యలు తప్పవని గూగుడులో ఎక్కడైనా మద్యం విక్రయాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ వెంకటేశులు ఓ ప్రకటనలో తెలిపారు. గూగూడు గ్రామ మొత్తం ఎక్కడికడ నిఘానేత్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# లేబర్ కోడ్ రద్దు చేయాలి



చాగల్లు,జులై 6 (సందేశం టైమ్స్) : చాగల్లు మండలం చాగల్లులో హమాలీ జట్టు ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ప్రభుత్వ సంస్థలు రైల్వే గోడౌన్స్ ఆర్టీసీ రైల్వే స్టేషన్ బజారు జట్టు రైస్ ఆయిల్ దాల్ మిల్స్ స్పిన్నింగ్ మిల్స్ మార్కెట్ యార్డ్ లో సివిల్ సప్లై లో బేవరేజ్ హమాలిస్ కోల్డ్ స్టోరేజ్ ఇసుక ర్యాంపులు లోడింగ్ అన్ లోడింగ్ లో పనిచేసే కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం చాగల్లు బేవరేజ్ హమాలిలు గోడౌన్ వద్ద జూలై 9 దేశవ్యాప్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగు సమ్మె పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం చింతలపూడి నాగేశ్వరావు అధ్యక్షతన గేటు మీటింగ్ జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మందికి పైగా పనిచేస్తున్న వీరిలో 95 శాతానికి చట్టబద్ధమైన సౌకర్యాలు ఏమీ అమలు కావడం లేదని పని భద్రత లేదని ప్రమాదం జరిగితే పట్టించుకునే దిక్కే లేదని ముఠా కార్మికుల శ్రమ ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్థానిక సంస్థల యజమానులకు కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతున్నాయి అన్నారు కానీ కార్మికుల సంక్షేమానికి ఒక నయా పైసా కూడా కేటాయించడం లేదని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు పని భద్రత గుర్తింపు కార్డులు కనీస వేతనాలు ఈపీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా గ్రాట్యుటి పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను గ్యారంటీ చేసే పద్ధతిలో సమగ్ర చట్టాన్ని చేయాలని అందుకు అవసరమైన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ నుంచి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

# అప్పుల భారం వద్దు!

## ఆచంట సహకార సంఘానికి రూ.2.14 కోట్ల కేంద్ర రుణం

- రెండేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
- రుణంలో సంఘం వాటా రూ.42.86 లక్షలు
- రైస్ మిల్లు నిర్మాణానికి చర్యలు
- అధికారులే ప్రతిపాదనలు సిద్ధం చేశారు
- తీవ్రంగా వ్యతిరేకించిన సొసైటీ సభ్యులు
- కేంద్ర రుణం వద్దని మహాజన సభ తీర్మానం
- కూటమి సర్కార్ నిలుపుదల చేస్తుందని ఆశ



ఆచంట, జులై 6(సందేశం టైమ్స్) : రైతులకు విశేష సేవలందిస్తున్న మృత్యుంజయ సహకార సంఘంపై కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్టుతో అప్పుల భారం పడనుంది. 2023లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 11 రాష్ట్రాల్లో 11 చోట్ల వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు చేపట్టింది.రాష్ట్రంలో ఆచంట సొసైటీని ఎంపిక చేయడంతో రూ.2.14 కోట్లతో రైస్‌మిల్లు నిర్మాణానికి ప్రతిపాదించారు. కేంద్ర రుణంతో సొసైటీ వాటా రూ.42.86 లక్షలు చెల్లించాలి. 2023 ఏప్రిల్ మంజూరు కాగా ప్రత్యేకాధికారుల పాలనలో సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం జరిగిన మహాజన సభలో సొసైటీ సభ్యులు రుణ భారంపై తీవ్ర వ్యతిరేకించారు. ఇప్పటికే ఉన్న మిల్లు నిర్వహణ భారంతో లీజుకు ఇచ్చారని, ఇప్పుడు అప్పు తీసుకుని మరో మిల్లు నిర్మాణం ఎందుకని సభ్యులు, రైతులు అభ్యంతరం తెలిపారు. మహాసభ తీర్మానం చేసినా అధికారులు ఖాతరు చేయకుండా రైస్ మిల్లు నిర్మాణం చేపట్టారు. దీనితో పలువురు సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. సొసైటీ అధికారులు కూడా కోర్టును ఆశ్రయించడంతో వేలాది రూపాయల భారం పడిందని రైతులు చెబుతున్నారు. రైస్‌మిల్లు నిర్మాణం కోర్టు స్టే కారణంగా నిలిచిపోయింది. సొసైటీ సభ్యుల అభిప్రాయానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరించడంతో గ్రామస్థులు, రైతులు, అఖిలపక్ష నాయకులు కూడా అప్పట్లో ఆందోళనలు చేపట్టారు. ఒక సమయంలో సొసైటీలో డిపాజిట్లు కూడా వెనక్కి తీసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అధికారులు ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో సొసైటీ దివాలా తీస్తుందని ఖాతాదారులు, రైతులు పలుసార్లు సొసైటీ వద్ద సమావేశాలు ఏర్పాటుచేసి తీర్మానాలు కూడా చేశారు. అప్పట్లో ప్రజాప్రతినిధులు కూడా ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని సభ్యులు, రైతులు, అఖిల పక్ష నాయకులు కోరుతున్నారు.

# నెమ్మదిగా సాగు



మచిలీపట్నం,జులై 6(సందేశం టైమ్స్) ,: మే నెలలో 10 రోజుల పాటు కురిసిన వర్షం, ఆ తరువాత ముఖం చాటేసింది. జూన్ ప్రారంభం నుంచి వర్షాలు సక్రమంగా కురుస్తాయని రైతులు ఆశించినా నిరాశే మిగిలింది. జూలైలో వర్షాలు కురవకపోగా, ఉష్ణోగ్రతలు పెరిగి వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో నారుమడులలో ఎదుగుదల లోపించింది. నాట్లు వేసిన పొలాల్లో వరిపైరు బతకడానికి సమయం పడుతోంది. కాల్వలకు అరకొరగా నీటి విడుదల జరుగుతుండటంతో వాతావరణం సాగుకు ఎప్పటికీ అనుకూలంగా మారుతుందోనని, వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడోనని రైతులు ఆశగా చూస్తున్నారు.

సక్రమంగా విడుదల కాని సాగునీరు

గతనెల 23 నుంచి జిల్లాలోని అన్ని ప్రధాన కాల్వలకు పుష్కలంగా సాగునీరు విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కానీ, పూర్తిస్థాయిలో నీటి విడుదల జరగలేదు. 1.25 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీటిని సరఫరా చేసే బందరు ప్రధాన కాల్వకు పూర్తిగా సాగునీరు విడుదల కాలేదు. మచిలీపట్నం శివారు భూములకు ఇంకా నీటి విడుదల జరగనేలేదు. నీటి విడుదలకు ఇంకా రెండు రోజులు పడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. దివిసీమకు సాగునీటిని సరఫరా చేసే పరివాట్లు వేగవంతంతః ఖరీఫ్ సీజన్‌లో 1.62 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని అంచనా. కంకిపాడు, ఉయ్యూరు, మొవ్వ, వల్లపల్లి, మోపిదేవి, పామర్రు, తోట్లవల్లూరు, ఘంటసాల, పెనమలూరు తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా పోసిన నారుమడులు సిద్ధం కావడంతో వరినాట్లు వేసే పనులు వారం రోజులుగా సాగుతున్నాయి.

# సంపాదకీయం

## సమస్యల సుడిలో సంపద సృష్టికర్తలు

కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది.

ఇటీవల దూరదర్శన్ సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ తమ పదకొండేళ్ల పాలన శ్రామికుల సంక్షేమం చుట్టూ సాగిందని, ఉపాధి కల్పన, సాంఘిక సంక్షేమంలో గణనీయమైన వృద్ధి సాధించామని పేర్కొన్నారు. అదే సందర్భంలో కార్మికుల సాధికారత, సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కూడా తెలిపారు. కానీ వాస్తవమేమిటంటే మోదీ ప్రభుత్వ విధానాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వీరి విధానాల వల్ల పేదరికం ఎంతగా పెరిగిందంటే దేశంలో ఐదేళ్ల లోపు పిల్లలలో 36 శాతం మంది ఉండవలసిన దానికంటే తక్కువ బరువు ఉన్నారు. ఇది పౌష్టికాహార లోపానికి సూచిక. అలాగే 15-49 మధ్య వయసుగల మహిళలలో రక్తహీనత 2015-16లో 53 శాతం నుంచి 2019-20కి 57.2 శాతానికి పెరిగింది. ఇదే వయస్సు గర్భిణులలో రక్తహీనత 50.4 శాతం నుంచి 52.2 శాతానికి పెరిగింది. ఒక పరిశోధన ప్రకారం 2023-24లో గ్రామీణ భారతంలో 40 శాతం మంది రెండుపూటలా భోజనం కూడా తీసుకోలేకపోతున్నారు. ఈ గణాంకాలన్నీ దేశంలో పెరుగుతున్న పేదరికానికి చిహ్నాలు.అదే సందర్భంలో దేశంలోని కార్పొరేట్ సంస్థల ఆదాయాలు మాత్రం ఎలాంటి హద్దూ లేకుండా పెరిగిపోతున్నాయి. సంపద కేంద్రీకృతమవుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రకృతి వనరులను మోదీ ప్రభుత్వం కారు చవకగా వీరికి ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా దేశంలో శత కోటీశ్వరులు సంఖ్య 2014లో వంద నుంచి 2024 నాటికి రెండు వందలకు పెరిగింది. వంద మంది శత కోటీశ్వరుల ఆస్తి 85 లక్షల కోట్ల రూపాయలకు పైగా చేరింది. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు ఇది నిదర్శనం. దేశంలో నేటి ఈ ఆర్థిక అసమానతలకు కారణం ప్రభుత్వ విధానాలే. ప్రభుత్వ పన్నుల విధానం క్రమేణా కార్పొరేట్ల నుంచి ప్రజలపై భారాలు వేసే దిశగా మారింది. మొత్తం రెవిన్యూ పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 2014-15లో 34.5 శాతం ఉండగా, 2024-25 కల్లా అది 27.2 శాతానికి తగ్గిపోయింది. దీనికి తోడు ఈ పదకొండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం 16.61 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల బ్యాంకుల రుణాలను మాఫీ చేసింది.ఇదే సమయంలో సంపద సృష్టికర్తలయిన శ్రామికుల కష్టాలు మరింతగా పెరిగాయి. సంఘటిత రంగంలో వేతన వృద్ధి ముందు ఐదేళ్లలో 10.1 శాతం ఉండగా, 2014-20 మధ్య ఆరు శాతానికి పడిపోయింది. ధరల పెరుగుదల వల్ల నిజ వేతనాలు పడిపోతున్నాయి. నికర జోడింపు విలువలో కార్మికుల వాటా 2020లో 18.9 శాతం నుంచి 2023 నాటికి 15.9 శాతానికి తగ్గిపోయింది. ఇదే కాలంలో కార్పొరేట్ల లాభాల వాటా 38.7 శాతం నుంచి 51.9 శాతానికి పెరిగింది.కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది. తమ విధానాలు ఇలా ఉండగా ప్రధాని వేరే విధంగా మాట్లాడడం సహేతుకం కాదు.ప్రభుత్వం నిజంగా కార్మిక సంక్షేమానికి నిధులు రాబట్టాలంటే దానికి అనేక మార్గాలున్నాయి. ఒక మార్గం ప్రభుత్వ బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు బకాయిపడ్డ రుణాలను వసూలు చేయడం. ప్రభుత్వ బ్యాంకులు 4,10,758 కోట్ల రూపాయల బకాయి కోసం 16,420 నోటీసులు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు పెట్టి రుణాలు వసూలు చేయడానికి బదులు, ఆశ్చర్యకరంగా వాటిని ఒక్క కలం పోటుతో రద్దు చేసేసింది.కార్మికులపై ఈ ఆర్థిక భారాలు చాలవన్నట్లు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను చేసింది. రోజుకు 8 పని గంటల స్థానంలో 12 గంటలు, అంతకంటే ఎక్కువ పనిచే సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులు సహా అనేక అంశాలను సమూలంగా మార్చివేసింది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ప్రతిఘటనతో దేశవ్యాప్తంగా ఒకేసారి వీటి అమలుకు మోదీ ప్రభుత్వం సంశయిస్తున్నా, తమ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న వివిధ రాష్ట్రాల్లో వీటి అమలు ఇప్పటికే ప్రారంభమయింది. వేతనాలు పెరగక పోవడం, పని గంటలు పెరగడం, హక్కులు కోల్పోవడం వంటి సుడిగుండంలో నేడు దేశంలోని శ్రామికులున్నారు. మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అంటే ఈ పదకొండేళ్లలో 22 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించవలసి ఉంది. కానీ దీనికి భిన్నంగా ఉన్న ఉద్యోగాలే కోల్పోయే స్థితి ముఖ్యంగా నేడు దేశంలోని ప్రభుత్వ సంస్థల్లో నెలకొని ఉంది. కేంద్ర ప్రభుత్వ స్వంత నివేదికల ప్రకారమే ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉద్యోగుల సంఖ్య 2013లో 17.3 లక్షలు ఉండగా 2022 నాటికి ఈ సంఖ్య 14.6 లక్షలకు పడిపోయింది.

## కాడెద్దులతో ఒకేరోజు 25 ఎకరాల్లో కంది విత్తనం



నందికొట్కూరు, జులై 6(టుడే విదుర,:కాడెద్దులతో ఒకే రోజు ఏకంగా 25 ఎకరాల్లో కంది విత్తనం వేసి ఔరా అనిపించాడు నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన రైతు శ్రీనివాసులు. రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో శ్రీనివాసులు తాను కౌలుకు తీసుకున్న పొలంలో కంది సాగుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. ఏకబిగిన మొత్తం 25 ఎకరాల్లో తన కాడెద్దులతో దున్నుతూ.. మరో ఇద్దరి సాయంతో కంది విత్తనం వేసి అందరినీ అబ్బురపరిచాడు.

# కోర్టు నిర్ణయం మేరకు చర్యలు



విజయవాడ,జులై 6(సందేశం టైమ్స్) :విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి ఇంటర్న్‌షిప్ విషయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యపై హైకోర్టు తీర్పును బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు వెల్లడించారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. 'ప్రస్తుతం ఆందోళన చేస్తున్న విద్యార్థులు విదేశాల్లో వైద్య విద్య చదువుకుని కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేశారు. ఇక్కడే ఉండి ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి రెండేళ్ళు, చదువుకున్న దేశంలో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఏడాది సమయం జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇచ్చింది. దీనిపై కొంతమంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయిం చారు. ఈ కేసు అక్కడ పెండింగ్‌లో ఉంది. జాతీయ మెడికల్ కౌన్సిల్, హైకోర్టు ఇచ్చే తీర్పును బట్టి ప్రస్తుతం ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యకు పరిష్కార మార్గాలను యోచిస్తాం' అని దగ్గుమాటి తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ, జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. ఈ తరహా కేసులు బిహార్, పంజాబ్, మహారాష్ట్ర, కేరళ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

# పరిశ్రమల్లో భద్రతపై థర్డ్‌పార్టీ ఆడిట్



విజయవాడజులై 6(సందేశం టైమ్స్) : : పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా పరీక్షలు చేయించుకోవాలని అగ్నిమాపక శాఖ యాజమాన్యాలను ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలను ఆ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ వెల్లడించారు. తెలంగాణలోని పాశమైలారంలో సిగాచి ఫార్మా కంపెనీలో ప్రమాదం నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చామన్నారు. అగ్నిమాపక శాఖ వద్ద తగిన నిపుణులు లేకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు థర్డ్ పార్టీలను నియమించుకుని భద్రతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అగ్నిమాపక శాఖకు సెల్ఫ్ అఫిడవిట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి పరిశ్రమలోనూ డస్ట్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, ప్రతి విభాగంలో సేఫ్టీ ఆడిట్ క్షుణ్ణంగా చేయాలని స్పష్టంచేశారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యం తోపాటు సేఫ్టీ ఆడిట్ చేసిన థర్డ్ పార్టీని కూడా ప్రాసిక్యూషన్ చేస్తామని తెలిపారు.

## వర్సిటీలకు వీసీలు దొరకలేదా

- ఏడాదైనా ఇన్‌చార్జి పాలనే
- 9 విశ్వవిద్యాలయాల్లో ఇక్కట్లు
- నిలిచిపోయిన విధాన నిర్ణయాలు
- జాతీయ విద్యా సంస్థల నుంచి మేధావులను తేవాలని యత్నం
- ముందుకు సాగని ప్రక్రియ



(అమరావతి)జులై 6(సందేశం టైమ్స్) : విశ్వవిద్యాలయాల పాలనకు వైస్ చాన్సలర్లే కీలకం. కానీ... రాష్ట్రంలో ఏకంగా తొమ్మిది వర్సిటీలు ఏడాదికిపైగా ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. జగన్ హయాంలో వీసీలుగా నియమితులైనవారు ప్రభుత్వం మారడంతో రాజీనామాలు చేశారు. ఆ తర్వాత నోటిఫికేషన్ జారీకి ప్రభుత్వం కొంత సమయం తీసుకుంది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబరు 9న 17 వర్సిటీలకు వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. అప్పట్లో దాదాపు 2,500 దరఖాస్తులు అందాయి. అయితే, జాతీయ విద్యా సంస్థల ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 18న తొమ్మిది వర్సిటీలకే వీసీలను నియమించింది. ఆంధ్రా, జేఎన్‌టీయూకే, యోగి వేమన, విక్రమ సింహపురి, రాయలసీమ, జేఎన్‌టీయూ అనంతపురం, పద్మావతి మహిళా, కృష్ణా, నన్నయ వర్సిటీలకు వీసీలను నియమించింది. అయితే, హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి వచ్చి వేమన వర్సిటీ వీసీగా నియామకం పొందిన ఫణీత్ ప్రకాశబాబు ఆ తర్వాత మంచి అవకాశం రావడంతో రాజీనామా చేసి వెళ్లిపోయారు. దీంతో మళ్లీ 9 వర్సిటీలకు వీసీలను నియమించాల్సి వచ్చింది. వీటిలో ఆచార్య నాగార్జున, శ్రీకృష్ణ దేవరాయ, జేఎన్‌టీయూ విజయనగరం, ద్రవిడ, ఉర్దూ, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఆంధ్ర కేసరి, శ్రీవెంకటేశ్వర, వేమన యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో నాగార్జున, ఎస్వీయూ, శ్రీకృష్ణ దేవరాయ వంటి కీలక వర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో పాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు కొత్త సెర్చ్ కమిటీలు కొన్నాళ్ల కిందట ప్రభుత్వం 4 యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను నియమించింది. యూజీసీ కొత్త నామినీలతో శ్రీకృష్ణ దేవరాయ, జేఎన్‌టీయూ విజయనగరం, ఆచార్య నాగార్జున, ద్రవిడియన్ యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు సిఫారసు చేసిన పేర్లు ప్రభుత్వానికి అందాయి. కాగా, ప్రభుత్వం మొత్తం తొమ్మిది వర్సిటీలకు ఒకేసారి వీసీల పేర్లు ప్రకటించాలనే ఆలోచనలో ఉంది. దీనికిగాను మరో రెండు మూడు నెలల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

వీసీలే కీలకం...

రెగ్యులర్ వీసీ ఉంటే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. లేనిపక్షంలో సాధారణ అంశాలకే ఈసీ పరిమితం అవుతుంది. వర్సిటీల్లో కీలక మార్పులు చేయాలంటే వీసీ నేతృత్వంలోని ఈసీ నిర్ణయం తీసుకోవాలి. కీలకమైన ఆర్టీయూకేటీ కూడా రెగ్యులర్ చాన్స్‌లర్ లేకుండానే కొనసాగుతోంది. ఇటీవల ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు చాన్స్‌లర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. డైరెక్టర్లు కూడా వైసీపీ ప్రభుత్వంలో నియమించినవారే కొనసాగుతున్నారు. మరోవైపు ఉన్నత విద్యామండలిలో వైస్ చైర్మన్లు ఇప్పటికీ జగన్ ప్రభుత్వం నియమించినవారే ఉన్నారు.

## లక్కీడ్రా పేరుతో మోసం ముగ్గురు మోసగాళ్ల అరెస్టు

మిర్యాలగూడ,జులై 6(సందేశం టైమ్స్) : లక్కీ డ్రా పేరు తో మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతా ల ప్రజలను మోసం చేసిన ముగ్గురు ఘరానా మోసగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆరికే ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మల్టీలెవల్ సంస్థను స్థాపించి.. లక్కీ డ్రా పేరుతో సభ్యులను చేర్పిస్తున్నారని తెలిపారు.




# క్రీడావార్తలు




## సంజు శాంసన్‌కు జాక్‌పాట్..

## రికార్డు ధర పలికిన స్టార్ బ్యాటర్!




టీమిండియా వికెట్ కీపర్, ఓపెనర్ సంజూ శాంసన్ రికార్డు ధర పలికాడు. సగం బిడ్డింగ్ మొత్తాన్ని కేవలం ఈ స్టార్ బ్యాటర్ కోసమే వెచ్చించిందో ఫ్రాంచైజీ. అతడ్ని రూ. 26.8 లక్షల ధర చెల్లించి సొంతం చేసుకుంది. కోట్లు పలికే సంజూకు ఇంత తక్కువ అమౌంట్ దక్కితే రికార్డు ఎలా అయిందనేగా మీ సందేహం.. అక్కడికే వస్తున్నాం. ఇది కేరళ క్రికెట్ లీగ్‌లో చోటుచేసుకుంది. ఇప్పుడు మన దేశంలో చాలా రాష్ట్రాల్లో పొట్టి ఫార్మాట్‌లో స్థానికంగా లీగ్స్ పెడుతున్నారు. ఈ క్రమంలోనే నిర్వహిస్తున్న కేరళ క్రికెట్ లీగ్‌కు సంబంధించిన ఆక్షన్ తాజాగా జరిగింది. ఇందులో శాంసన్ అత్యధిక ధరకు అమ్ముడుబోయాడు. కొచ్చి బ్లూ టైగర్స్ జట్టు రూ. 26.8 లక్షల ధరకు సంజూ శాంసన్‌ను సొంతం చేసుకుంది. లీగ్ చరిత్రలో అత్యధిక ధరకు అమ్ముడుబోయిన ఆటగాడిగా సంజూ చరిత్ర సృష్టించాడు. గతంలో ఎంఎస్ అఖిల్ (రూ. 7.4 లక్షలు-త్రివేంద్రం రాయల్స్) పేరిట ఉన్న రికార్డును సంజూ చెరిపేశాడు. కాగా, కేరళ క్రికెట్ లీగ్ వేలంలో ప్రతి జట్టు రూ. 50 లక్షల వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అయితే కొచ్చి బ్లూ టైగర్స్ తమ పర్స్‌లోని సగం కంటే ఎక్కువ మొత్తాన్ని కేవలం సంజూ కోసమే ఖర్చు చేసేసింది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్‌లో ఆడుతూ కోట్లు గడిస్తున్న సంజూకు ఇది చాలా తక్కువ మొత్తమే కావొచ్చు. కానీ ఆడుతున్నది రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ కాబట్టి అక్కడ మరో రికార్డును సృష్టించడంపై అతడి ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సూపర్ రికార్డ్ అని అంటున్నారు. ఇకపోతే, వచ్చే ఐపీఎల్‌లో రాజస్థాన్ నుంచి చెన్నైకి సంజూ మారతాడని రూమర్స్ వస్తున్నాయి. సీఎస్‌కే అతడి కోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని వినిపిస్తోంది.

## టచ్ చేయలేని రికార్డులు..

## సిరాజ్ అంటే ఇది!




మహ్మద్ సిరాజ్.. టీమిండియా పేస్ యూనిట్‌లో కీలక బౌలర్. కొన్నేళ్లుగా భారత జట్టు విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తూ వస్తున్నాడీ హైదరాబాదీ. మూడు ఫార్మాట్లలోనూ టీమ్‌కు తురుపుముక్కగా మారిన సిరాజ్.. గెలుపు కోసం ఏం చేసేందుకైనా వెనుకాడడు. అత్యుత్తమ ప్రదర్శనతో జట్టుకు ఎన్నో విజయాలు అందించినా సిరాజ్‌కు ఎందుకో తోపు పేసర్ అనే గుర్తింపు రావడం లేదు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి వంటి సీనియర్ల నీడలో ఎదుగుతూ వచ్చిన సిరాజ్.. ఇప్పుడు లెక్కలు మార్చే పనిలో పడ్డాడు. ఇంగ్లండ్ టూర్‌ను అందుకోసం వాడుకుంటున్నాడు. టచ్ చేయలేని రికార్డులను సృష్టిస్తూ తాను మామూలోడ్ని కాదని నిరూపిస్తున్నాడు. తిరుగులేని ఫిట్‌నెస్‌తో ఉన్న సిరాజ్.. దాన్ని ఇంగ్లండ్ పర్యటనలో వాడుకుంటున్నాడు. భారీ స్పెల్స్ వేస్తూ ప్రత్యర్థి జట్టును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. అదే సమయంలో బుమ్రా లేకపోయినా పేస్ యూనిట్‌ను తాను నడపగలనని, వికెట్లు తీస్తూ టీమ్‌కు విజయాలు అందించగలనని నిరూపిస్తున్నాడు. అందుకు ఎడ్జ్‌బాస్టన్ టెస్టే ఉదాహరణ. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా ఆడుతున్న ఇంగ్లండ్‌ను సైంధవుడిలా అడ్డుకున్నాడు సిరాజ్. 6 వికెట్లతో ప్రత్యర్థి వెన్ను విరిచాడు. క్రాలే, రూట్, స్టోక్స్ లాంటి ప్రధాన బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించాడు. ఈ ప్రదర్శనతో ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లో ఫైఫర్ (5 వికెట్లు) తీసిన అరుదైన బౌలర్‌గా బుమ్రా సరసన చోటు దక్కించుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో 6 వికెట్లు తీసిన మూడో భారత బౌలర్‌గా కపిల్ దేవ్, ఇషాంత్ శర్మ సరసన చోటు దక్కించుకున్నాడు.

## జావెలిన్ విప్లవానికి నాంది..




బెంగళూరు తన పేరిట శనివారం ఇక్కడ జరుగనున్న క్లాసిక్ ఈవెంట్ దేశంలో జావెలిన్ త్రో విప్లవానికి నాంది పలకగలదన్న ఆశాభావాన్ని నీరజ్ వ్యక్తంచేశాడు. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో ఈ పోటీ జరగనుంది. భవిష్యత్ భారత జావెలిన్ త్రోయర్లలో ఈ టోర్నీ స్ఫూర్తి నింపుతుందని నమ్ముతున్నాడు. నీరజ్‌తోపాటు మరో ఇద్దరు ఒలింపిక్ పతక విజేతలు థామస్ రోలెర్, జూలియస్ ఎగో పోటీ బరిలో దిగుతున్నారు. భారత్ నుంచి చోప్రాతోపాటు రోహిత్ యాదవ్, సాహిల్ సిల్వాల్, జస్వీర్ సింగ్ తలపడుతున్నారు. మొత్తం 12 మంది త్రోయర్లు ఈ ఈవెంట్ బరిలో నిలిచారు.

## ఇంగ్లండ్ చెత్త రికార్డు..

## టీమిండియాతో పెట్టుకుంటే ఇట్లుంటది!




ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో ఎదురీదుతోంది ఇంగ్లండ్. తొలుత బౌలింగ్‌లో విఫలమైన ఆ జట్టు.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఒకదశలో 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే హ్యారీ బ్రూక్ (158), జేమీ స్మిత్ (184) పోరాటంతో కోలుకున్న ఆతిథ్య జట్టు.. భారత్‌ను భయపెట్టింది. కానీ పర్యాటక జట్టు పేసర్లు చెలరేగడంతో టీమిండియా స్కోరుకు 180 పరుగుల దూరంలోనే ఆగిపోయింది. ఈ క్రమంలో ఓ చెత్త రికార్డును మూటగట్టుకుంది ఇంగ్లండ్. అదేంటో ఇప్పుడు చూద్దాంరెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులకు ఆలౌట్ అయింది ఇంగ్లండ్. బ్రూక్, స్మిత్ రాణించినా టాపార్డర్‌తో పాటు మిడిల్, లోయరార్డర్‌లో పలువురు బ్యాటర్లు ఫెయిల్ అయ్యారు. ఏకంగా ఆరుగురు డకౌట్ అవడం గమనార్హం. ఓపెనర్ బెన్ డకెట్, ఓలీ పోప్‌తో పాటు కెప్టెన్ బెన్ స్టోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. తద్వారా చెత్త రికార్డును మూటగట్టుకుంది. 148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో 400 ప్లస్ స్కోరు చేసిన జట్టులో ఆరుగురు బ్యాటర్లు డకౌట్ అవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 64 పరుగులతో ఉంది. టీమిండియా ఆధిక్యం 244 పరుగులకు చేరుకుంది. కేఎల్ రాహుల్ (28 నాటౌట్), కరుణ్ నాయర్ (7 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

## భవాని డబుల్ ధమాకా



ఒలోమౌక్ (చెక్ రిపబ్లిక్): ప్రపంచ పారా అథ్లెటిక్స్ మహిళల గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెట్ వి.భవాని రెండు స్వర్ణాలు కొల్లగొట్టి సంచలనం సృష్టించింది. చెక్ రిపబ్లిక్‌లోని ఒలోమౌక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భవాని 100, 200 మీటర్ల స్ప్రింట్‌లో పసిడి పతకాలు సాధించింది. టీ46 విభాగంలో 100 మీ., రేసును 13.70 సెకన్లలో, 200 మీ., రేసును 29.07 సెకన్లలో ముగించి ప్రథమ స్థానం దక్కించుకుంది. భవాని స్వస్థలం

## ఏంటిది మాగ్నస్..

## ఓటమి ఒప్పుకోవడానికి ఇంత భయమా..




తెలుగు బిడ్డ గుకేష్ దొమ్మరాజు చెస్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకుంటున్నాడు. తిరుగులేని ఆటగాడిగా మారిపోయాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్లను అవలీలగా ఓడిస్తున్నాడు. ప్రపంచ చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్సన్‌ను ఒకసారి కాదు.. రెండు సార్లు ఓడించాడు. జులై మూడవ తేదీన జరిగిన సూపర్ యునైటెడ్ రాపిడ్ అండ్ బ్లిండ్జ్ టోర్నమెంట్‌లో కూడా మాగ్నస్‌ను చిత్తుచిత్తుగా గుకేష్ ఓడించాడు. మొదటి సారి ఓటమి పాలైన సమయంలో మాగ్నస్ తట్టుకోలేకపోయాడు. ఒకరకంగా పిచ్చివాడిలా మారిపోయాడు.సూపర్ యునైటెడ్ రాపిడ్ అండ్ బ్లిండ్జ్ టోర్నమెంట్ ప్రారంభం అవ్వడానికి ముందు గుకేష్‌పై తన అక్కసు వెల్లగక్కాడు. మాగ్నస్ మీడియాతో మాట్లాడుతూ..'టోర్నమెంట్‌లో అతడితో పోటీ పడుతుంటే.. ఓ బలహీనమైన ఆడగాడితో పోటీ పడుతున్నట్లు ఉంది' అని అన్నాడు. టోర్నమెంట్‌లో ఓటమి తర్వాత ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. గుకేష్‌ను విమర్శించటం మానేశాడు. తనను తాను విమర్శించుకున్నాడు. మీడియాతో మాట్లాడుతూ... 'గుకేష్ అద్భుతంగా ఆడుతున్నాడు. వరుసగా ఐదు గేమ్స్ గెలవటం అన్నది మామూలు విషయం కాదు. నిజానికి.. ప్రస్తుతం నేను చెస్ ఆడటాన్ని అంతగా ఆస్వాధించలేకపోతున్నా. నేను అసలు ఆడుతున్నట్లుగా కూడా లేదు. చిరాకుగా ఉంది. నా పరిస్థితి ఇప్పుడు ఏం బాగోలేదు' అని అన్నాడు. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇండియన్ నెటిజన్స్ మాగ్నస్‌ను ఆడుకుంటున్నారు. 'దెబ్బ అదుర్స్ కదూ.. బలహీనమైన ఆటగాడితో రెండు సార్లు ఎలా ఓడిపోయావు మాగ్నస్'..'మాగ్నస్‌ను ఓడించడానికే గుకేష్ చెస్ ఆడుతున్నట్లు ఉంది.. సూపర్ ప్లేయర్' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# బిజినెస్



# పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్..

## తగ్గిన బంగారం ధరలు..




భారత స్త్రీలకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎంత బంగారం ఉన్నా.. ఇంకా కావాలనే అంటారు. ఇక, శుభకార్యాల్లో కూడా బంగారం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. జనం పెట్టుబడులకు కూడా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో గత కొద్ది రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోయాయి. నేడు మాత్రం బంగారం కొనాలనుకునే వారికి ఊరట లభించింది. బంగారం ధరలు తగ్గాయి. హైదరాబాద్‌లో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,730 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,500 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,050 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,720 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,490 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,050 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఫినిక్స్ ట్రైటాన్‌లో అర్థ గ్లోబల్ రూ.700 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్‌లోని ఫినిక్స్ ట్రైటాన్ కమర్షియల్ రియల్టీ ప్రాజెక్ట్‌లో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ వెల్లడించింది. ఫినిక్స్ ఈ నిధులను ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి వినియోగించనుంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ కేంద్రంగా పని చేస్తున్న రూ.5,000 కోట్ల కేటగిరీ 3 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) అయిన అర్థ గ్లోబల్ దేశంలో పెట్టిన తొలి పెట్టుబడి ఇది. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 3.15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న 28 లక్షల చదరపు అడుగుల ఈ ప్రాజెక్టుకు నాలుగేళ్ల కాలపరిమితి గల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో ఈ నిధులు అందించింది. నేరుగా ప్రాజెక్టు అమ్మకాలతో అనుసంధానమైన వేరియబుల్ రిటర్న్ నమూనాలో ఈ పెట్టుబడి ఉంటుంది. దీనివల్ల డెవలపర్‌పై నగదుపరమైన ఒత్తిడులుండవు. ఇన్వెస్టర్లకు కూడా ఆకర్షణీయమైన రాబడి లభిస్తుందని అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్




మేనేజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ సచిన్ సావ్రికర్ అన్నారు.

# డెట్ కన్సాలిడేషన్ లోన్ రీస్ట్రక్చరింగ్ వీటిలో ఏది మంచిది..




ప్రస్తుతం భారత్‌లో లక్షలాది మంది మధ్య తరగతి కుటుంబాలు అధిక రుణభారంతో ఇబ్బంది పడుతున్నాయి. ఖర్చులు పెరగడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, క్రెడిట్ సులభంగా లభించడం వంటి అనేక అంశాల వల్ల చాలా మంది నెలకు ఒకటి కంటే ఎక్కువ %జువీ×%లు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో రుణాలను తీర్చలేక డిఫాల్ట్ అవుతున్నారు కూడా. %ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ప్రకారం 2024లో క్రెడిట్ కార్డులపై నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ 28 శాతం పెరిగి రూ. 6,742 కోట్లకు చేరింది. ఇలాంటి పరిస్థితుల్లో రెండు ప్రధాన ఆర్థిక వ్యూహాలను పాటించడం ద్వారా ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వాటిలో ఒకటి డెట్ కన్సాలిడేషన్ రెండోది లోన్ రీస్ట్రక్చరింగ్ ( ఇవి రెండూ రుణ భారం తగ్గించేందుకు ఉపయోగపడతాయి. అది ఎలా అనేది ఇక్కడ తెలుసుకుందాం. %డెట్ కన్సాలిడేషన్ అనేది మీరు తీసుకున్న వివిధ రకాల రుణాలను ఒకే రుణంగా కలిపుకునే ప్రక్రియ. ఉదాహరణకు క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్లు, ఇతర చిన్న రుణాలు కలిపి ఒక పెద్ద లోన్ తీసుకుని వాటన్నింటినీ క్లియర్ చేస్తారు. తద్వారా మిగతా అన్ని %జువీ×%లు తొలగిపోయి ఒక్కటి మాత్రమే ఉండటం వల్ల మీకు గందరగోళం తక్కువగా ఉంటుంది. ఈ విధంగా తీసుకునే కొత్త లోన్ చాలా సందర్భాల్లో తక్కువ వడ్డీ రేటుతో లేదా ఎక్కువ కాలపరిమితితో ఉంటుంది. ఇది నెలవారీ చెల్లింపులను తగ్గిస్తుంది. ఉదాహరణకు క్రెడిట్ కార్డు వడ్డీ రేటు వార్షికంగా 30% నుంచి 48% వరకు ఉంటుంది. అయితే పర్సనల్ లోన్ వడ్డీ రేటు 11% నుంచి 22% మధ్య ఉండొచ్చు. కానీ కన్సాలిడేషన్ ద్వారా ఈ అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణంతో బదిలీ చేయడం వల్ల మీరు ఎక్కువ మొత్తాన్ని ఆదా చేసుకోవచ్చు. అయితే ఇది ప్రయోజనకరంగా ఉండటానికి మీకు స్థిరమైన ఆదాయం, మంచి క్రెడిట్ స్కోరు ఉండాలి. ఈ పద్ధతిని అనుసరించిన తర్వాత కూడా మీరు డిసిప్లిన్‌తో చెల్లింపులు కొనసాగిస్తే మీ క్రెడిట్ స్కోరు కూడా మెరుగవుతుంది. కానీ, వ్యయ నియంత్రణ లేకుండా మళ్లీ అధిక రుణాలను తీసుకుంటే, మళ్లీ పాత పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంటుంది. లోన్ రీస్ట్రక్చరింగ్ అనేది మీ ప్రస్తుత రుణం చెల్లించలేని పరిస్థితుల్లో, అదే రుణదాత ద్వారా మిమ్మల్ని ఆదుకునే ఓ మార్గం. దీనిలో భాగంగా రుణ కాలవ్యవధిని పెంచడం. వడ్డీ రేటును తగ్గించడం. కొన్ని నెలల పాటు చెల్లింపులు నిలిపివేయడం లేదా కొంత మొత్తం మాఫీ చేయడం జరుగుతుంది. ఈ పద్ధతి %జూం×ణ%-19 సమయంలో చాలా ప్రాచుర్యం పొందింది. అప్పట్లో దేశవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది రుణదారులకు మోరేటోరియం లేదా రీస్ట్రక్చరింగ్ అవకాశం ఇచ్చారు. కన్సాలిడేషన్ కంటే ఇది ఒక చివరి దశలో వచ్చే సహాయం. మీరు ఉద్యోగం కోల్పోవడం, ఆదాయం లేకపోవడం వంటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇందులో బ్యాంకు లేదా %చీదీఖీజ%లు మీ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, రుణ నష్టాన్ని తగ్గించుకునే ఉద్దేశంతో కొంత మార్పు చేస్తారు. దీని వల్ల దీర్ఘకాలిక ప్రభావాలు ఉండొచ్చు. రీస్ట్రక్చర్ చేసిన రుణాలు మీ క్రెడిట్ రిపోర్టులో రికార్డవుతాయి. తద్వారా భవిష్యత్తులో మీరు రుణాలు తీసుకోవాలంటే ప్రభావం పడుతుంది. మీరు ఇప్పటికీ %జువీ×%లు చెల్లించగలిగే స్థితిలో ఉంటే డెట్ కన్సాలిడేషన్ బెస్ట్ ఆప్షన్. ఇది మీకు సౌలభ్యం కలిగించడంతో పాటు వడ్డీని తగ్గించి మీ డబ్బును ఆదా చేస్తుందిమీరు ఇప్పటికే పేమెంట్లు మిస్ అవుతూ, డిఫాల్ట్ అవబోతున్న పరిస్థితిలో ఉంటే, లోన్ రీస్ట్రక్చరింగ్ మీకు తాత్కాలిక ఉపశమనాన్ని అందిస్తుంది

# కారును అమ్మకుండానే ఇలా లోన్ తీసుకోండి..

ఇంటర్నెట్ డెస్క్: జీవితంలో అప్పుడప్పుడు ఊహించని ఆర్థిక సమస్యలు, అత్యవసర పరిస్థితులు వస్తుంటాయి. అలాంటి సమయంలో చాలామంది తమ ఆస్తులను, ప్రధానంగా కారును అమ్మి డబ్బు సమకూర్చుకోవాలని ఆలోచిస్తారు. కానీ, కారును అమ్మకుండానే దానిని ఉపయోగించి అప్పు తీసుకోవచ్చు. అవును మీరు చదివింది నిజమే. మీ కారు మీకు ఆర్థిక సహాయం అందించగల సాధనంగా మారుతుంది. కారు అనేది కాలక్రమేణా విలువ తగ్గే ఆస్తి అయినప్పటికీ, అత్యవసర సమయంలో ఇది మీకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దేశంలో అనేక బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు కారును తాకట్టుగా ఉంచి అప్పులను అందిస్తాయి. ఇది సెక్యూర్డ్ లోన్ కాబట్టి, సాధారణ వ్యక్తిగత రుణాల కంటే త్వరగా లభిస్తుంది. మీ కారు అప్పుకు అర్హమేనా? కానీ మీ కారుతో అప్పు తీసుకోవాలంటే కొన్ని షరతులు పాటించాల్సి ఉంటుంది. సాధారణంగా కారు మీ పేరుపై నమోదై పని చేస్తూ ఉండాలి. అలాగే దాని రుణం పూర్తిగా తీర్చి ఉండాలి. వాణిజ్య వాహనాలు, ఉత్పత్తి ఆగిపోయిన కార్లు లేదా వివాదంలో ఉన్న వాహనాలు అప్పుకు




అర్హత పొందవు. ఉదాహరణకు యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా ఫైనాన్స్ వంటివి 10 సంవత్సరాల వరకూ పాత కార్లను అంగీకరిస్తాయి. అయితే బ్యాంక్ 12 సంవత్సరాల వరకు అనుమతిస్తుంది. త

# 2ఏళ్లలో రూ. 36,671 కోట్ల అక్రమార్జన

## డెరివేటివ్ ట్రేడింగ్‌లో అమెరికా సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం

## సెక్యూరిటీ మార్కెట్ నుంచి కంపెనీని నిషేధించిన సెబీ

## రూ.4,843 కోట్ల అక్రమ లాభాలు తిరిగి చెల్లించాలని ఆదేశం




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మరో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ గ్రూప్ మన మార్కెట్ వ్యవస్థను తెలివిగా బురిడీ కొట్టించి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించిందని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గుర్తించింది. అందుకుగాను, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధించిన సెబీ.. రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటివరకు మార్కెట్ సంస్థ నుంచి సెబీ జప్తు చేసుకోనున్న అతిపెద్ద మొత్తమిదే

అధిక లావాదేవీలు జరిగే బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ సూచీల స్థాయిలను కృత్రిమంగా పెంచడం లేదా తగ్గించడం ద్వారా జేన్ స్ట్రీట్ గ్రూప్ ఈ భారీ మోసానికి పాల్పడిందని సెబీ గుర్తించింది. ప్రధానంగా ఈ రెండు సూచీ ఆప్షన్స్ ట్రేడింగ్ ద్వారా రూ.36,671 కోట్లు పోగేసింది. 2023 జనవరి నుంచి 2025 మార్చి మధ్య కాలంలో డెరివేటివ్ కాంట్రాక్టులకు సంబంధించి 21 ఎక్స్‌పైరీ (గడువు) తేదీల్లో ఈ గ్రూప్ తన చేతివాటాన్ని ప్రదర్శించిందని నియంత్రణ మండలి దర్యాప్తులో వెల్లడైంది. ఆ గడువు తేదీల్లో సూచీల గమనాన్ని ప్రభావితం చేసి ఆప్షన్స్ మార్కెట్లో పొజిషన్ల ద్వారా భారీగా గడించేందుకు ఈ గ్రూప్ కంపెనీలు క్యాష్, ఫ్యూచర్స్ మార్కెట్లో భారీ ఎత్తున లావాదేవీలు నెరిపాయంటోంది. ఇందుకోసం జేన్ స్ట్రీట్ రెండు వ్యూహాలను ఎంచుకుంది. 1. ఇంట్రాడే ఇండెక్స్ మ్యానిపులేషన్ స్ట్రాటజీ. 2. మార్కింగ్ ది క్లోజింగ్ స్ట్రాటజీ. ఉదయం సెషన్‌లో బ్యాంక్ నిఫ్టీ సూచీ నమోదిత షేర్లు, వాటి ఫ్యూచర్స్‌లో పెద్దఎత్తున కొనుగోళ్లు జరపడం ద్వారా కృత్రిమంగా వాటి ధరలతోపాటు వాటికి గిరాకీ పెంచడం. ఉదయం కొనుగోలు చేసిన షేర్లు, ఫ్యూచర్స్‌లో మధ్యాహ్నం సెషన్ నుంచి ఉన్నఫళంగా అమ్మకాలకు పాల్పడటం ద్వారా వాటి ధరలను ఒక్కసారిగా తగ్గించడం చేసింది. తద్వారా జేన్ స్ట్రీట్ అప్పటికే తీసుకున్న ఇండెక్స్ ఆప్షన్స్ పొజిషన్ల ద్వారా భారీగా లాభం గడించింది.


# ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్..

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివర్లో బ్యాంకింగ్ సహా ఇతర బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 193.42 పాయింట్ల వృద్ధితో 83,432.89 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 83,477.86 వద్ద గరిష్ఠాన్ని, 83,015.83 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన సూచీ.. రోజంతా 462 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడింది. నిఫ్టీ విషయానికొస్తే, 55.70 పాయింట్ల లాభం తో 25,461 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించగా.. బజాజ్ ఫైనాన్స్ 1.60 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. జేన్ స్ట్రీట్ వివాదం నేపథ్యంలో స్టాక్ బ్రోకింగ్,



ఎక్స్ఛేంజ్‌లు, డిపాజిటరీ సంస్థల షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రోకరేజీ సేవల కంపెనీల్లో నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ స్టాక్ 11.26 శాతం క్షీణించగా.. ఏంజిల్ వన్ 5.94 శాతం నష్టపోయింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ షేరు సైతం 6.42 శాతం పతనమైంది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎసఎల్) స్టాక్ 2.29 శాతం నష్టపోయింది.

# వచ్చే రెండేళ్లలో రూ.75 కోట్ల పెట్టుబడులు




వచ్చే రెండేళ్లలో తెలంగాణలో రూ.75 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ హాఫీజ్‌ఫేట్‌లో సరికొత్త 4 స్క్రీన్స్ మల్టీప్లెక్స్ థియేటర్‌ను ప్రారంభించిన సందర్భంగా కంపెనీ సీఓఓ రోహాన్ సాబ్లే మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రానున్న రెండేళ్లలో ప్రతిపాదిత పెట్టుబడులతో మరో ఐదు మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మల్టీప్లెక్స్‌తో 20 కొత్త స్క్రీన్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. అంతేకాకుండా కొత్తగా 400 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీంతో తెలంగాణలో మొత్తం ఉద్యోగాల సంఖ్య 1,700కు చేరుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం దక్షిణాది రీజియన్‌లో పీవీఆర్ ఐనాక్స్ 565 స్క్రీన్స్‌ను నిర్వహిస్తుండగా అందులో 106 స్క్రీన్స్ హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006